అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 173. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ మంగళవారం.25.03.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## కేసీఆర్‌కు అసెంబ్లీలో మాట్లాడేందుకు మొఖం లేదు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ:అసెంబ్లీలో మాట్లాడేందుకు మొఖం చాటేసిన మాజీ సీఎం కేసీఆర్, బయట మాత్రం అబద్దాల ప్రచారానికి తెరలేపుతున్నారని ప్రభు త్వ విప్ ఆదిశ్రీనివాస్ విమర్శించా రు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. బహిరంగ సభ పేరున నాటకాలాడుతున్నారని విమర్శించారు. కరీంన గర్ సభకు వచ్చి కించప రిచే విధంగా మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చ రించారు. ప్రతిపక్ష నేత పదవి క్యాబినెట్ హోదా కాదా?అని ప్రశ్నించా రు. ఒకరు పింకు బుక్ ఒకరు బ్లాక్ బుక్, రెడ్ బుక్‌లో రాసుకుంటున్నా మంటూ చెబుతున్నారనీ, ఈ ఉడుతూపులకు భయపడేవారు ఎవరూ లేరని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా మాట్లాడటం మానుకోవాలని సూచించారు. కేటీఆర్ తనకు తానే మంచివాడిని కాదం టూ చెప్పుకుంటున్నారనీ, అది నిజమేనన్నారు. ఆయనలో మంచితనం లేదు కాబట్టే కేసీఆర్‌ను ఫాంహౌస్ నుంచి బయటకు రానీయటం లేదని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ కేటీఆర్ నోటికి వచ్చినట్టు మాట్లాడటం మానుకోవాలని సూచించారు.

## న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు 'ఐలు' ఖండన

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ చంపాపేటలో జరిగిన న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు కె. సత్యనారాయణ, ఐలు రాష్ట్ర కార్యదర్శి పార్థసారథి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాది కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. హత్యలకు పాల్పడుతున్న హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో అనేక మంది న్యాయవాదులు హత్యలకు గురవుతుండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వాలు సరైన చొరవ చూపకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని చెప్పారు. న్యాయవాదులందరూ ఐక్యంగా నిలబడి న్యాయవాదుల రక్షణ చట్టం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమస్యలను న్యాయపరంగా ఎదుర్కోవాల్సింది పోయి హత్యలు చేయడం పరిష్కారం కాదని అభిప్రాయపడ్డారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం జరిగే పోరాటంలో ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# కేటీఆర్‌ను కలిసిన హెచ్‌సీయూ ఐక్య కార్యాచరణ బృందం



మియాపూర్ :అమృత్ తెలంగాణ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది రోజులుగా విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తమ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుతూ సోమవారం యూనివర్సిటీ విద్యార్థులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో కలిశారు. తమ ఆందోళనలకు సంబంధించిన వివరాలను కేటీఆర్‌కు విద్యార్థులు వివరించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం పట్ల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ యూనివర్సిటీ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో, ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా మద్దతు అందిస్తామని కేటీఆర్ తెలిపారు. భూముల పరిరక్షణ కోసం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసేందుకు సహకారం అందిస్తామని చెప్పారు. అలాగే, బ్యాకరి కంచె భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే అక్కడి వైవిధ్యమైన జీవవైవిధ్యం, వృక్షజాలం నశించి పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర పర్యావరణ శాఖ జోక్యం చేసుకోవాలని, ఆ శాఖ మంత్రిని కలవాలని కేటీఆర్ విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్‌తో పాటు విద్యార్థి విభాగం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్‌తో సమన్వయం చేసుకోవాలని కేటీఆర్ తెలియజేశారు. తమ ఆందోళనను అర్థం చేసుకొని, న్యాయమైన డిమాండ్‌కు సానుకూలంగా స్పందించిన కేటీఆర్‌కు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. తమ ఆందోళనను దేశంలోని అన్ని యూనివర్సిటీలకు విస్తరిస్తామని, హైదరాబాద్ యూనివర్సిటీ భూములతో పాటు పర్యావరణపరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని విద్యార్థులు ప్రకటించారు.

## రాహుల్ గాంధీ పౌరసత్వం..కేంద్రానికి 4 వారాల గడువు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పౌరసత్వంపై అలహాబాద్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు వారాల్లో పౌరసత్వం అంశం తేల్చాలని కేంద్రానికి గడువు నిర్దేశించింది. అయితే కేంద్ర సర్కార్ 8 వారాల గడువు కోరగా.. నాలుగు వారాల గడువు ఇస్తూ.. తదుపరి విచారణను లక్నో బెంచ్ ఏప్రిల్ 21వ తేదీకి వాయిదా వేసింది. ఆలోగా స్టేటస్ రిపోర్ట్‌ను కేంద్రం కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. రాహుల్ గాంధీ పౌరసత్వంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. ఆయన బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ వేసిన పిటిషన్లపై తాజాగా అలహాబాద్ హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఓ బ్రిటన్ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. ఈ క్రమంలో వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# ధనవంతులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు



హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ధనవంతులైన విద్యార్థులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు వస్తున్నాయని ఎంఐఎం పక్షనేత నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం అసెంబ్లీలో పురపాలన, పట్టణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమం, సమాచార, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసన వ్యవహారాలు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ రంగాల పద్దులపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్లు, మేడలు ఉన్న వారికి కూడా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పొందుతున్నారని వివరించారు. అనర్హులు వాటిని తీసుకోవడం వల్ల అర్హులకు అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. అర్హులైన వారికే నిబంధనల ప్రకారం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుని అన్ని పార్టీలూ అంగీకరిస్తే తప్పకుండా అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. దీనిపై తమకు అభ్యంతరం లేదన్నారు. తాము కూడా అఖిలపక్షానికి సిద్ధమేనని బీఆర్ఎస్ సభ్యులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. విధాన ప్రకారమే నిబంధనలకు అనుగుణంగానే అర్హులను ఎంపిక చేయాలని కోరారు. బీజేపీ సభ్యులు రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గంలో కూడా అనర్హులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని చెప్పారు. సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ లాజికల్‌గా అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పింది బాగుందనీ, ప్రాక్టికల్‌గా వచ్చేసరికి చాలా ఇబ్బందులు వస్తాయని అన్నారు. ఏ పథకం ప్రారంభించినా కొన్ని నియమ, నిబంధనలుంటా యని వివరించారు. ప్రాక్టికల్‌కు వచ్చేసరికి పేదలు ధనవంతులుగా, ధనవంతులు పేదలుగా చూపెడతారని అన్నారు. అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి సమగ్రంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి అనర్హులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పొందుతున్నారంటూ అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పింది వాస్తవమన్నారు. విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు రాక తనకు ఫోన్ చేస్తున్నారని చెప్పారు. ట్రంప్ వచ్చాక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అయితే తల్లిదండ్రులకు కారు, మోటార్ సైకిల్ ఉండొచ్చనీ, అయినంత మాత్రాన వారి పిల్లలను విదేశాల్లో చదివించుకునే స్తోమత లేదన్నారు. అందులో ఎస్సీ,ఎస్టీ,బీసీలున్నారని వివరించారు. ఈ సమస్యను ఎలా పరిష్కరించాలో ఆలోచించాలని కోరారు. అర్హులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు రాని విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులు ఎంత మంది ఉన్నారో లెక్కలు తీయాలనీ, వారికి న్యాయం చేయాలని కోరారు.

## ఎస్ఎల్బీసీ సహాయక చర్యలు - సీఎం రేవంత్ కీలక ఆదేశాలు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎస్ఎల్బీసీ టన్నెల్ లో సహాయక చర్యలు చేపట్టి నెల రోజులు దాటినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. ఇప్పటి వరకు ఒక మృతదేహాన్ని మాత్రమే వెలికి తీశారు. ఈ క్రమంలో ఎస్ఎల్బీసీ సహాయక చర్యలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యల నిరంతర పర్యవేక్షణ కోసం సీనియర్ ఐఏఎస్ అధికారిని నియమించాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. సహాయక చర్యలు నిరంతరం కొనసాగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పారు. సహాయక చర్యలు త్వరగా జరిగేలా చూడాలని చెప్పారు. సహాయక చర్యలకు కేంద్రం నుంచి అవసరమైన అనుమతులను త్వరగా తీసుకోవాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా సహాయక చర్యలను నిపుణుల సలహాలతో ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు.

## కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం..ఎంపీలకు జీతాలు పెంపు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ఎంపీలకు కేంద్రప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. వారి జీతభత్యాలతో పాటు పెన్షన్, అదనపు పెన్షన్‌ను సైతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ పెంపును 2023, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు నెల జీతం రూ. లక్ష నుంచి లక్షా 24 వేలకు, అలాగే వారికిచ్చే దినసరి భత్యాన్ని రూ. 2 వేల నుంచి రూ. 2, 500కు పెంచింది. మాజీ ఎంపీలకు సైతం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ శుభవార్త వినిపించింది. మాజీ ఎంపీల పెన్షన్‌ను నెలకు రూ. 25 వేల నుంచి రూ.31 వేలకు సవరించింది. ఐదేళ్లకుపైగా ప్రతి అదనపు సంవత్సరానికి అదనపు పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.2,500కు పెంచింది. చివరిగా 2018లో ఎంపీల జీతభత్యాలు పెంచింది. ప్రస్తుతం పార్లమెంట్‌లో లోక్ సభకు 543, రాజ్యసభకు 245 మంది ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరందరికీ ఈ తాజా పెంపు వర్తించనుంది. రోజు రోజుకు ఖర్చులు పెరుతున్న నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది

# వడగండ్ల వాన ఊడ్చేసింది




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తమ తమ నియోజకవర్గాల్లో వడగండ్ల వాన పంటలను ఊడ్చేసిందనీ, చేతికందే దశలో పంట రాళ్లపాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. అది పూర్తికాగానే పరిహారాన్ని అందజేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు వివరించారు. సోమవారం శాసనసభ జీరో అవర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని మాడ్గులలో వడగండ్ల వానకు నాలుగువేల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని వివరించారు. కరెంట్ స్తంభాలు కూలిపోయి ఆయా గ్రామాల్లో కరెంట్ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పనులను వేగవంతం చేయాలని కోరారు. తలకొండపల్లి, పండగొని చెరువు కట్ట తెగిపోయాయనీ, వెంటనే మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసుధన్‌రెడ్డి కూడా పంట నష్టపోయి రైతులను ఆదుకోవాలని కోరారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ నిర్మల్‌లో ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. రైతులు కోర్టుల చుట్టూ తిరగలేకపోతున్నారని తెలిపారు. నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతిరెడ్డి మాట్లాడుతూ పసుపు పంట కు మద్దతు ధర కోసం, ఎర్రజొన్న కొనుగోలు కోసంఇంకెన్నాళ్లూ ఈ పిల్ల తోవలు

గిరిజన ఎమ్మెల్యే ఆవేదన


తమ నియోజకవర్గాల్లోని తండాలకు పిల్లతోవలు ఇంకెన్నాళ్లంటూ గిరిజన ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, తెల్లం వెంకట్రావు, మురళీనాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని తండాలకు బైక్‌లు, ఆటోలు కూడా పోవని తెలిపారు. అత్యవసర సమయాల్లో ఆస్పత్రికి చేరుకోవాలంటే నరకం కనిపిస్తోందని వాపోయారు. వాగులపై బ్రిడ్జిలు లేకపోవడంతో వానాకాలంలో గిరిజనులు కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. బోథ్ కేంద్రంలో డిగ్రీ కళాశాలలకు అనుమతి ఇవ్వాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ ఏర్పాటు చేయాలన్నారు. వెంకటాపూర్, చర్లకు రహదారికి అనుమతి ఇవ్వాలని కోరారు. రైతులు ఉద్యమించారని తెలిపారు. వారిపై పెట్టిన కేసులను ఎత్తేయాలని కోరారు. కామారెడ్డి శాసనసభ్యులు వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ చాలాకాలంగా ఉద్యోగులకు, పోలీసు సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ శాసనసభ్యులు వీరపల్లి శంకర్ మాట్లాడుతూ చటాన్‌పల్లి ఆర్వోబీని పూర్తి చేయాలన్నారు. తన నియోజకవర్గంలో ఎమ్ఎన్సీ కంపెనీల్లో స్థానికులకు ఉపాధి కల్పించా లని డిమాండ్ చేశారు. జేపీ దర్గాకు అభివృద్ధి నిధులు విడుదల చేయాలని కోరారు. ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తాపస్‌పల్లి, రాజాపేట, గుండాల గ్రామాల్లోని చెరువుల్లో తుంగను తొలగించాలన్నారు. ఆ కాల్వను పునరుద్ధరించాలని కోరారు. తాండూరు శాసనసభ్యులు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక మున్సిపాల్టీలో తాగునీటి కొరత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి శాసనసభ్యులు డాక్టర్ సంజరుకుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్‌లో ఓ మాజీ మంత్రికి సంబంధం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నదనీ, సమగ్ర విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎల్ఆర్ఎస్ గడువు పొడిగించే ఆలోచన లేదు: మంత్రి పొంగులేటి



హైదరాబాద్:అమృత్ తెలంగాణ: ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్పందన ఉందని.. అయితే గడువు పొడిగించే ఆలోచన ఇప్పటికైతే లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. "అక్రమ లేఔట్లు రిజిస్ట్రేషన్ చేసిన సబ్‌రిజిస్ట్రార్లు సస్పెండ్ అవుతున్నారు. ఎవరూ ఇబ్బంది పడకూడదనే ఎల్ఆర్ఎస్ అమలు చేస్తున్నాం. భూముల రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి. భూమికి మ్యాప్ లేని వాళ్లకు కూడా సర్వే చేయించి నిర్ధరిస్తాం. భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ల ఛార్జీలు పెరుగుతాయి. దాదాపు వెయ్యి మంది సర్వేయర్లను నియమిస్తాం" అని పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ఈనెల 31లోపు చెల్లించాలని పీఆర్టీయూ తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్దుల్లా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల బిల్లులు సుమారు రెండేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయుల వేతనంలో నుంచి మినహాయించిన డబ్బులు అవసరానికి ఉపయోగించుకోవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పిల్లల పెండ్లికిగాని తల్లిదండ్రుల ఆస్పత్రి ఖర్చులుగాని చెల్లించాలంటే తాము జమ చేసిన డబ్బులు అవసరానికి కూడా వాడుకునే పరిస్థితి లేదని తెలిపారు. సరెండర్ బిల్లులు, మెడికల్ బిల్లులు, ఇన్సూరెన్స్ డబ్బులు, జీపీఎఫ్ డబ్బులు కూడా ఏండ్ల తరబడి ఈ-కుబేర్‌లో ఉన్నాయని వివరించారు. బిల్లులు రాక ఉపాధ్యాయులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీఏలు ఇవ్వడం లేదనీ, పీఆర్సీ ఊసేలేదని పేర్కొన్నారు. డీఏలు అడిగితే జీతాలిచ్చేది కష్టమని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని తెలిపారు. పైసా పైసా జీపీఎఫ్‌లో జమ చేసుకుంటే అవసరానికి అందడం లేదని పేర్కొన్నారు. పిల్లల పెండ్లి ఎలా చేయాలనీ, ఆస్పత్రి ఖర్చులు ఎలా భరించాలని ప్రశ్నించారు. కేవలం జీతం తప్ప ఏమీ ఇవ్వకుండా ప్రభుత్వం వ్యవహరించడం సరైంది కాదని తెలిపారు

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

హైదరాబాద్ : అమృత్ తెలంగాణ:ఇవాళ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. గత వారం వరుసగా ఐదు రోజుల పాటు భారీ స్థాయిలో పెరిగిన భారత స్టాక్ మార్కెట్లు ఈ వారం ప్రారంభం రోజున సైతం అదే తీరు కొనసాగించాయి. మార్కెట్లకు విదేశీ జోష్, ఫెడ్,ఎఫ్ఐఐల పెట్టుబడుల బూస్టింగ్ భారీగా ప్రభావం చూపింది. ఈ ఉదయం మార్కెట్ ప్రారంభమైన కొన్ని నిమిషాలు ఒడిదుడుకులు ఎదుర్కొని ఆ తర్వాత నుంచి ఏకబిగిన మార్కెట్లు భారీగా పెరిగాయి. తొలుత మార్కెట్ సెంటిమెంట్ బాగుండడంతో అన్ని ఇండెక్స్ లు ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,079 పాయింట్లు పుంజుకొని 77,984 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 80వేల మార్క్ ని టచ్ చేయడం ఇవాల్టి ట్రేడింగ్ లో ఒక విశేషం. ఇక, నిఫ్టీ 308 పాయింట్లు ఎగబాకి 23,658 దగ్గర నిలిచింది.

## కార్పొరేటర్ సుజాత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన MLA సుధీర్ రెడ్డి ని అరెస్టు చేయాలని, ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ డిమాండ్



బాణావత్ గోవింద నాయక్ ఆదివాసి కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్

అమృత్ తెలంగాణ ఖానాపూర్ న్యూస్ : GHMC 16వ డివిజన్ కార్పొరేటర్ గిరిజన మహిళ సుజాత పై అవమాన పరుస్తూ అనుచిత్య దురుసుగా వాక్యాలు చేసిన MLA సుధీర్ రెడ్డి పై, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినందుకు, రాష్ట్ర పోలీస్ అధికారులకు, అభినందిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నాము అలాగే వెంటనే సుధీర్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపించాలని, పోలీస్ అధికారులకు ఆదివాసి కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేస్తుంది

## కేశఖండనానికి హాజరైన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



పాపను ఆప్యాయంగా ఎత్తుకున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ కు చెందిన శ్రీనివాస్ – స్వప్న కూతురు కేశఖండన కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నలిమెల నవీన్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్ రెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

## రుణమాఫీ కానీ రైతులకు రుణమాఫీ వెంటనే చేపట్టాలి..

**రెండు లక్షల పైన ఉన్న రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలి....**

**లేనిపక్షంలో రైతులతో ఉద్యమం తీవ్రతరం చేస్తాం సిపిఎం నాయకులు గైని మురళి, డిమాండ్**



రుణమాఫీ చేయాలంటూ రైతుల నిరసన కార్యక్రమం

నిర్మల్ జిల్లా భైంసా మార్చ్ 24 అమృత్ తెలంగాణ భైంసా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు రైతు ఋణ మాఫీ గురించి రైతుల నిరసన కార్యక్రమం నిర్వహించారు సిపిఎం నాయకులు గైని మురళి, ఆధ్వర్యంలో రైతులు నిరసన కార్యక్రమం నిర్వహించారు సిపిఎం నాయకుడు మాట్లాడుతూ రెండు లక్షలపైన ఉన్న డబ్బులను కట్టిన వెంటనే రెండు లక్షల రూపాయల రుణమాఫీకి అర్హత పొందుతారని వారికి కూడా రుణమాఫీ జరుగుతుందని చెప్పిన ముఖ్యమంత్రి కానీ ముఖ్యమంత్రి చెప్పిన దానికి విరుద్ధంగా వ్యవసాయ శాఖ మంత్రి ఇప్పుడు రెండు లక్షల పైన ఉన్నవారికి రుణమాఫీ వర్తించదని తెలపడం ఎంతవరకు సమంజసం అని రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి తీరాలని లేనిపక్షంలో రైతులతో ఉద్యమం తీవ్రతరం చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సట్వాజి, రైతులు పాల్గొన్నారు

## ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ : సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, డబుల్ బెడ్ రూమ్, రైతు రుణమాఫీ తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా అధికారులందరూ సమయానికి ప్రజావాణి కి హాజరుకావాలని ఆదేశించారు. ప్రజావాణి రిజిస్టర్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా రేషన్ కార్డులు కలిగి ఉన్న ప్రజలందరికీ సన్నబియ్యం పంపిణీ చేయడానికి ఏర్పాట్లను పూర్తి చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. పదవ తరగతి పరీక్షల కేంద్రాలను ప్రత్యేక అధికారులు తనిఖీలు చేయాలని, ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ, నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

అధిక ఉష్ణోగ్రతల కారణంగా, జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పలు ప్రాంతాల నుంచి ప్రజల అర్జీలను ఫోన్ ద్వారా స్వీకరించారు. ప్రజల సమస్యలను విని, వాటిని నమోదు చేసుకొని, సంబంధిత అధికారులకు ఆయా సమస్యల పరిష్కారం కొరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా సోమవారం టెలిఫోన్ ప్రజావాణి ద్వారా 8 మంది దరఖాస్తుదారులు వివిధ ప్రాంతాలనుండి తమ అర్జీలను సమర్పించారు. దరఖాస్తు వివరాలను వాట్సప్ ద్వారా స్వీకరించి. ప్రజావాణిలో సమస్య నమోదుకు సంబంధించి రసీదును సంబంధిత వ్యక్తులకు వాట్సప్ ద్వారా అందించారు. దూరప్రాంత ప్రజల సహాయార్థం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు పలువురు టెలిఫోన్ ప్రజావాణి అర్జి దారులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో గలం విప్పిన ఎమ్మెల్యే పాయల శంకర్





అసెంబ్లీలో మాట్లాడుతున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ అసెంబ్లీలో గలం విప్పిన ఎమ్మెల్యే పాయల శంకర్ కురిసిన వడగళ్ల వాన వల్ల రాష్ట్రంలో ఉన్న రైతులు నష్టపోయారు చేతికి వంచిన పంట పూర్తిగా నష్టం అయిపోయింది ఈ పరిస్థితిని వివరిద్దామని నష్టపోయిన పంటలను తీసుకొచ్చి మీడియా పాయింట్లు చూయించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్దాం అనుకుంటే ఇక్కడ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం సెక్యూరిటీ వాళ్ళని అడ్డంపెట్టి మమ్మల్ని అడ్డుకోవడం జరిగింది... వెంటనే నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముందర నిరసన కార్యక్రమం చేయడం జరిగింది కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాయల్ శంకర్. పాల్వఈ హరీష్ బాబు వెంకట రమణారెడ్డి ధన్పాల్ సూర్యనారాయణ రామారావు పటేల్ ఉన్నారు మా ఆదిలాబాద్ పట్టణంలో కొమరం భీం కాలనీలో నివసిస్తున్నటువంటి ఆదివాసీలకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి అసెంబ్లీలో మాట్లాడడం జరిగింది

## భారత ప్రభుత్వం నీతి అయోగ్ జలవనరులు / భూ వనరుల విభాగం, న్యూఢిల్లీ నుండి నీటి వనరుల పునరుజ్జీవనం అమలు





అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : భారత ప్రభుత్వం నీతి అయోగ్ జలవనరులు / భూ వనరుల విభాగం, న్యూఢిల్లీ నుండి నీటి వనరుల పునరుజ్జీవనం అమలు పై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (CEO) NITI ఆయోగ్ అధ్యక్షతన ATE చంద్ర ఫౌండేషన్ నుండి సాంకేతిక సహకారంతో గుర్తించబడిన ఆకాంక్షాత్మక బ్లాకుల తో సోమవారం సంబంధిత జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో అదిలాబాద్ కలెక్టరేట్ NIC నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. చెరువుల్లో పూడికతీత తో నీటి నిల్వలు పెరిగి భూగర్భ జలాల అభివృద్ధి తో పాటు చెరువుల పరిధిలో ఆయకట్టు సాగుకు నీరు అందుబాటులోకి వస్తుందని, ఈ దిశగా ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ (ఆకాంక్షాత్మక బ్లాకుల)లో నీటి వనరుల పునరుద్ధరణ' కార్యక్రమాన్ని అమలు చేయడానికి నీతి ఆయోగ్ , జిల్లా యంత్రాంగం ATE చంద్ర ఫౌండేషన్ సహాయంతో తెలంగాణా రాష్ట్రం లోని అదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం ను అస్పరేషనల్ బ్లాక్ గా గుర్తించడం జరిగిందని నీటి భద్రతను పెంచే దిశగా నీతి అయోగ్, 2022-23లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జార?ండ్, రాజస్థాన్ , ఉత్తరప్రదేశ్ వంటి ఐదు రాష్ట్రాలలో నీటి వనరుల పునరుజ్జీవన కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి11 జిల్లాల్లో దాదాపు 697 నీటి వనరులు పునరుద్ధరించబడ్డాయని రైతులకు ఉపయోగకరంగా మారిందని అన్నారు. ఇదే తరహాలో ATE చంద్ర ఫౌండేషన్ యొక్క సాంకేతిక సహకారంతో తొమ్మిది రాష్ట్రాల్లోని 25 జిల్లాల్లో నీటి వనరుల పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించిందని, ఈ సందర్భంలో జిల్లాలోని నార్నూరు లో అంచనాలను తయారుచేసి నివేదికలు పంపాలని ప్రోగ్రాం డైరెక్టర్ యుగల్ జోషి తెలిపారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## ప్రజావాణి లో 99 దరఖాస్తులు





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదులలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో వివిధ మండలాల నుండి వచ్చిన దరఖాస్తుదారుల నుండి జిల్లా పాలనాధికారి రాజర్షి షా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సమస్యల పై అర్జీలను కలెక్టర్ కు అర్జీదారులు విన్నవించుకున్నారు. అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా వింటూ పరిష్కార దిశగా సంబంధిత అధికారులు సమస్యల పై స్పందిస్తూ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి , వెంటనే పరిష్కారమయ్యేది, కానిది తెలియజేయాలని, కార్యాలయాల చుట్టూ తిరగకుండా అర్జిదారుని సమస్య పై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించి 99 దరఖాస్తులు వచ్చాయని, శాఖల అధికారులకు అందిస్తూ దరఖాస్తుదారుని సమస్యను బట్టి తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఈ గ్రీవెన్స్ లో రెవెన్యు డివిజనల్ అధికారి వినోద్ కుమార్, జిల్లా అధికారులు, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.



## ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించకండి - ఫైన్లకు గురికాకండి.

**పట్టణంలో సీసీ కెమెరాల ఆధారంగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు ఫైన్లు.**

**త్రిబుల్ రైడింగ్, వితౌట్ హెల్మెట్, రాంగ్ రూట్, రాంగ్ పార్కింగ్ లాంటి పై సీసీటీవీ కెమెరాల ద్వారా ఫైన్.**

**అవగాహనాలతో కూడిన ఫ్లెక్సీలను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్.**

**పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో అవగాహన ఫ్లెక్సీలు, ఆడియో విధానం ద్వారా ప్రజలకు అవగాహన**




అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సీసీటీవీ కెమెరాలతో ఇకనుండి ట్రాఫిక్ నియమనిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఫైండ్లను విధించనున్నట్లు ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. ఈరోజు స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం సమావేశం మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మరియు ఉట్నూర్ ఏ ఎస్ పి కాజల్ సింగ్ డిఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి పోతారం శ్రీనివాస్ సిహెచ్ నాగేందర్ లు అవగాహనతో కూడిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని లేనియెడల సీసీ కెమెరాల ఆధారంగా ఆటోమేటిక్గా ఫైన్లకు గురి అవుతారని తెలిపారు. ఈ సీసీ కెమెరాలు ముఖ్యంగా వితౌట్ హెల్మెట్, రాంగ్ రూటు ప్రయాణం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, సెల్ఫోన్ డ్రైవింగ్, రేష్ డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్ లాంటి అంశాలలో వాహనదారులకు ఫైన్లను విధించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడలిన వినాయక చౌక్, కొమరం భీమ్ చౌక్, బస్టాండ్ ప్రాంతం, కిసాన్ చౌక్లు నందు అవగాహనతో కూడిన ఫ్లెక్స్ లను మరియు ఆడియోకు క్లిప్పులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రమాదాలకు గురి కాకుండా, ప్రమాదాలు గురైనప్పుడు ప్రాణనష్టం జరగకుండా తగ్గించడానికి ఇలాంటి నిర్ణయాలను ప్రభుత్వం ద్వారా తీసుకోబడడం జరుగుతుందని తెలిపారు.

## మీడియా అక్రెడిటేషన్ కార్డుల గడువు ఈనెల 31 వరకు

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ముగియనున్న నేపథ్యంలో మీడియా అక్రెడిటేషన్ కార్డుల గడువు మరో మూడు నెలలు 30-06-2025 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ తెలిపారు .

ఈ సందర్భంగా జిల్లాలోని పాత్రికేయ మిత్రులు మంగళవారం తేది:25.03.2025 న సాయంత్రం 4.00 గంటల నుండి అక్రెడిటేషన్ కార్డ్స్ పై స్టిక్కర్లు వేయించుకోగలరని తెలుపనైనది. జిల్లా పౌర సంబంధాల. అధికారిణి అదిలాబాద్

# ప్రజలకు మంచి పోలీసు సేవలను అందించాలి – జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్

స్టేషన్ ఎస్ హెచ్ ఓ లు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలి.
ప్రజలతో సత్సంబంధాలను మరింత మెరుగుపరచుకోవాలి
ప్రతి ఒక్క పోలీసు కు పోలీస్ క్రమశిక్షణ తప్పనిసరి.
జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలను, మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టాలి
జిల్లా వ్యాప్తంగా "పోలీసు మీకోసం" కార్యక్రమాలను నిర్వహించాలి
విలేజ్ పోలీస్ ఆఫీసర్ విధానాన్ని తిరిగి మరింత పటిష్టంగా నిర్వహించాలి
కోర్టు మానిటరింగ్ పద్ధతిని సమీక్షించి నేరస్తులకు శిక్షలు పడేవిధంగా కృషి చేయాలి
జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : జిల్లాకు నూతనంగా విచ్చేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్చార్జిలతో, సీఐలతో, డిఎస్పి లతో సిబ్బందితో సిబ్బంది ఇకనుండి తీసుకోవాల్సిన పాటించవలసిన పద్ధతులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బంది ప్రజలతో మమేకంగా ఉంటూ సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో మాదకద్రవేయులు పూర్తిగా రూపుమాపాలని వారిని అరికట్టే దిశగా ప్రతి ఒక్క పోలీసు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అదే విధంగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ తప్పనిసరి అని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరు విధులలో ఉన్నప్పుడు యూనిఫామ్ ని ధరించి ఉండాలని తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరు అవినీతికి దూరంగా ఉంటూ, నిజాయితీగా ప్రజలకు సేవలందించాలని తెలిపారు. జిల్లాలో ఉన్న రౌడీలను గ్యాంగులను ఏరివేసే దిశగా విధులను నిర్వర్తించాలని సూచించారు. అదేవిధంగా ప్రతిరోజు సిబ్బంది సకాలంలో ప్రజలకు హాజరయ్యేలా చూసుకోవాలని తెలిపారు. సిబ్బందికి వీక్లీ ఆఫ్ వచ్చే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని, ప్రతి ఒక్క సిబ్బందికి ఎలాంటి అడ్డంకులు లేకుండా తనదైన సెలవులను సాధ్యమైనంత త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. సిబ్బంది అందరికీ ఎలాంటి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని, లేనియెడల తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. డయల్ 100 ను విరివిగా వినియోగించుకుంటూ ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. నూతన పోలీసు సిబ్బంది అందరు తమ తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉండే విధంగా చూసుకోవాలని అదేవిధంగా సిబ్బంది అందరికీ అన్ని విధులకు పూర్తి పరిజ్ఞానాన్ని కల్పించి చైతన్య పరచాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సిసిటీవీ కెమెరాల ఏర్పాటను ప్రజలకు వివరించి ప్రతి గ్రామంలో ప్రజలు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చైతన్యపరచాలన్నారు. ఎస్సైలు, సీఐలు పోలీసు మీకోసం కార్యక్రమంలో భాగంగా తమ పరిధిలో ఉన్న ప్రతి గ్రామాన్ని సందర్శిస్థూ ప్రజలకు ఉన్న సమస్యలపై, సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్, మూఢనమ్మకాలు, డయల్ హండ్రెడ్ పై అవగాహన కల్పించి చైతన్యపరచాలని తెలిపారు. విలేజ్ పోలీస్ విధానాన్ని తిరిగి పున ప్రారంభించిన ప్రతిష్టంగా నిర్వహించాలని తెలిపారు. షీ టీం బృందాన్ని ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ మహిళలపై ఉన్న ప్రత్యేక సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా నాకబంద్ నిర్వహిస్తూ అక్రమ కార్యక్రమాలను, దొంగ వాహనాలను గుర్తిస్తూ నిర్వహించాలన్నారు. కోర్టు డ్యూటీ అధికారులను ప్రతిరోజు సమీక్షిస్తూ నేరస్థులకు కఠినమైన శిక్షలు పడే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా బహిరంగ మద్యం సేవించడం జరగకుండా చూడాలన్నారు. నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తూ ప్రమాదాలను అరికడుతూ ఉండాలన్నారు. కలప అక్రమ రవాణా, ప్రభుత్వ రాయితీ బియ్యం అక్రమంగా తరలించకుండా చూడాలన్నారు. వ్యభిచారం, గంజాయి, మటక, పేకాట ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా చూడాలి. ప్రతి పోలీస్ స్టేషన్లో బ్లూ కోర్ట్ విధులు, రిసెప్షన్ డ్యూటీ, కోర్టు డ్యూటీ అధికారులు కీలకంగా వ్యవహరిస్తూ ప్రజలకు సత్వర న్యాయం అందించే విధంగా కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, సి హెచ్ నాగేందర్, సిఐలు, ఎస్సైహ్చోలు ఆర్ఐలు, ఎస్ఐబి, డిసిఆర్బి, ఐటి కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యభట్ట ఇంటర్నేషనల్ స్కూల్ పేరెంట్స్ స్పోర్ట్స్ మీట్ డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ విభాగంలో గాదరి చంద్రశేఖర్ ప్రథమ బహుమతి పొందారు.









అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆర్యభట్ట ఇంటర్నేషనల్ స్కూల్ పేరెంట్స్ స్పోర్ట్స్ మీట్ డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ విభాగంలో గాదరి చంద్రశేఖర్ ప్రథమ బహుమతి పొందారు. జరిగినటువంటి ఆర్య ఫుడ్ ఫెస్టివల్లో వివిధ పోటీలలో గెలుపొందిన వారికి స్కూలు యాజమాన్యం ట్రోఫీ తో పాటు ప్రశంసా పత్రాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా తన చిన్నతనం నుంచి డ్రాయింగ్ పట్ల ఉన్న నైపుణ్యాన్ని గుర్తు చేసుకుంటూ మిత్రులు శ్రేయోభిలాషులు ఆయనకి అభినందనలు తెలిపారు.

# టిజిబి ఆధ్వర్యంలో భీమా చెక్కు అందజేత..




జన్నారం :అమృత్ తెలంగాణ: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కిష్టాపూర్ శాఖ ఆద్వర్యంలో సోమవారం రోజున 10 లక్షల ప్రమాద భీమా చెక్కును ఇటీవలే మరణించిన మండలంలోని దేవుని గూడా గ్రామానికి చెందిన అజ్మీర రామ్ సింగ్ కుటుంబానికి అందజేశారు. దేవునిగూడ గ్రామానికి చెందిన అజ్మీర రామ్ సింగ్ గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో ప్రమాదవశాత్తు మృతిచెందగా మృతుడు రామ్ సింగ్ భార్య అజ్మీరా రంగి కి 10 లక్షల రూపాయల బీమా చెక్కును ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ దాముక ప్రభుదాస్ చేతుల మీదుగా అందజేయడం జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిష్టాపూర్ గ్రామీణ బ్యాంకులో అకౌంట్ కలిగి ఉండి ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ రూ.500 కట్టడం వలన మృతుని కుటుంబానికి పది లక్షల రూపాయలు అందజేయడం జరిగిందని, అర్హులైన ప్రతి ఖాతాదారులు ఇన్సూరెన్సులు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ మేనేజర్ తో పాటు ఎస్బిఐ జనరల్ మేనేజర్ సమీర్ , ఎ పి ఎం బుచ్చన్న , తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కిష్టాపూర్ శాఖ మేనేజర్ రమాణ చైతన్య బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టును ఖండిస్తున్నాం



రాయపోల్ : అమృత్ తెలంగాణ:రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశా కార్యకర్తలు సమయత్తమవుతున్న తరుణంలో ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆశా కార్యకర్తల యూనియన్ రాయపోల్ మండల అధ్యక్షులు సుజాత, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు బాలమణి అన్నారు. సోమవారం కమిషనర్ కార్యాలయం ముట్టడిని అడ్డుకోవడానికి ఆశా కార్యకర్తలను ముందస్తు అరెస్టు చేసి రాయపోల్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల ఫిక్స్ డ్ వేతనం నిర్ణయించాలి. అర్హతలను బట్టి పదోన్నతి కల్పించాలని అలాగే పిఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసమే వైద్య ఆరోగ్య శఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపునివ్వడం జరిగిందన్నారు. కానీ ప్రభుత్వం కనీసం నిరసన వ్యక్తం చేసే హక్కును కూడా కాలరాస్తూ ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం శ్రమకు తగ్గ వేతనం కల్పించాలని పని ఒత్తిడి తగ్గించాలని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, రజిత, నవిత, లక్ష్మి, యాదమ్మ, వివిధ గ్రామాల ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులను ఖండించాలి..



దుబ్బాక :అమృత్ తెలంగాణ: సీఐటీయూ ఆధ్వర్యంలో ఆషా వర్కర్లు తమ హక్కుల కొరకు శాంతియుతంగా సోమవారం చలో హైదరాబాద్ కమిషనరేట్ ధర్నాకు వెళ్తున్న ఆషా వర్కర్లను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయడాన్ని సీఐటీయూ జిల్లా కోశాధికారి జీ.భాస్కర్ ఖండించారు.అనంతరం వారు మాట్లడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశాలకు ఫిక్స్ డ్ వేతనంగా రూ.18 వేలు అమలు చేస్తామని హామీనిచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. ఆశాలకు ప్రమోషన్,పీఎఫ్,ఈఎస్ఐ,ఉద్యోగ భద్రత తదితర సమస్యలను పరిష్కారం చేయకుండా జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లను అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని,మరణిస్తే మట్టి ఖర్చుల కింద రూ.50 వేలు ఇస్తామని,రిటైర్మెంట్ బెనిఫిట్స్,సెలవులు ఇస్తామని,టార్గెట్స్ రద్దు చేస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఫిక్స్ ఢ్ వేతనంగా రూ.18 వేలను వెంటనే అమలు చేసి ఉద్యోగ భద్రత,పీఎఫ్,ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆషా వర్కర్లు దేవలక్ష్మి,వసుంధర,బాబాయి,లత తదితరులు పాల్గొన్నారు.

# 'మధ్యాహ్న' బకాయిలు విడుదల చేయాలి




ముషీరాబాద్ :అమృత్ తెలంగాణ: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వారికి రూ.10,000 వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న అధ్యక్షతన మహాధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మధ్యాహ్న భోజన కార్మికులకు పది వేల రూపాయల వేతనం అమలు చేస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్నా నేటికీ అమలు చేయకపోగా.. అరకొరగా ఇచ్చే వేతనం కూడా పెండింగ్‌లో పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణలో పనిచేస్తున్న మహిళలంతా అట్టడుగు సామాజిక తరగతులకు చెందిన వారేనని, వారికి ఇచ్చే వేతనం చాలా తక్కువ అని, అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటోందని తెలిపారు. ప్రభుత్వం గుడ్డుకిచ్చే బడ్జెట్‌తో రెండు గుడ్లు కూడా రావు.. మూడు ఎక్కడి నుంచి తెచ్చి పెట్టాలని ప్రశ్నించారు. ఇప్పటికే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, కార్మికులు ఎంతకాలం అప్పులు చేసి పెడతారని ప్రశ్నించారు. గుడ్లను అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్టు ప్రభుత్వం నేరుగా పాఠశాలలకు కూడా సరఫరా చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా రంగానికి తగిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కేంద్ర స్కీమ్‌లకు కేంద్ర ప్రభుత్వం తన వాటా చెల్లించడం లేదు. దీని ప్రభావం మధ్యాహ్న భోజన కార్మికులపై కూడా పడుతోందని అన్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న మాట్లాడుతూ.. పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన బడ్జెట్ కేటాయించి అమలు చేస్తే మంచి ఫలితాలు పొందొచ్చన్నారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జె.వెంకటేష్, కూరపాటి రమేష్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్, యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ జి.పద్మ, మాయ, ఉన్ని కృష్ణ, చిన్నన్న, కృష్ణమాచారి, చామంతి లక్ష్మీ, పద్మ, సుల్తాన్, హంస తదితరులు పాల్గొన్నారు.

# తపాస్ పల్లి రిజర్వాయర్ ను నింపడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## రైతుల పంటలకు నీళ్ల అందించడంలో విఫలమైన ప్రభుత్వం

## ఎండిపోతున్న పంటలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి

## ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ. 50వేల నష్టపరిహారం చెల్లించాలి

## రిజర్వాయర్ నింపి చెరువులు, కుంటలకు నీళ్లు వదలక పోతే పోరాటం ఉధృతం చేస్తాం

## సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



చేర్యాల :అమృత్ తెలంగాణ: తపాస్ పల్లి రిజర్వాయర్ ను నింపడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి విమర్శించారు. రిజర్వాయర్ తో చెరువులు, కుంటలను నింపి పంటలను కాపాడాలని,ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఐ(ఎం)ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాత బస్ స్టాండ్ వద్ద రైతులకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకో వల్ల ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ అవకాశం ఉన్నా చేర్యాల ప్రాంత చెరువులు, కుంటలను తపాస్ పల్లి రిజర్వాయర్ ద్వారా నీళ్లను నింపకుండా నిర్లక్ష్యం వహించిన కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంత నాయకులు, ప్రజా ప్రతినిధులు బాధ్యత వహించి ఎండిపోతున్న రైతుల పంటల కు నష్టపరిహారం ఎకరాకు రూ. 50 వేల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ ను వెంటనే దేవాదుల నీటితో నింపి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట, మండలాల రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి చేర్యాల ప్రాంత రైతాంగం పోరాటాల ద్వారా తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ నాలుగు మండలా లు భౌగోళికంగా సముద్ర మట్టానికి 5 వందల అడుగుల ఎత్తున ఉన్న ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల రైతుల పంటలు ఎండిపోవడం జరుగుతున్న దృష్ట్యా గత ప్రభుత్వాలు ముందుచూపుతో దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా తపాస్ పల్లి రిజర్వాయర్ ను నిర్మించి ఇందులో నుండి కాలువల ద్వారా నాలుగు మండలాలలోని చెరువులు, కుంటలను నింపేందుకు ప్రణాళిక బద్ధమైన ఏర్పాట్లు ఉన్నప్పటికీ ఈ సంవత్సరం అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు రైతుల పట్ల ముందు చూపు లేకుండా ఏమాత్రం చిత్తశుద్ధి చూపకుండా నీళ్లను నింపకుండా నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే కరువులు గుర్తుచేస్తూ సీపీఐ(ఎం) గత రెండు నెలల నుండి అధికారులకు వినతి పత్రాలు, పత్రికా ప్రకటనలు, ఎండి పోతున్న చేనులను సందర్శించడం లాంటి కార్యక్రమాలు చేసినప్పటికీ ఏమాత్రం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు పట్టించుకోని కారణంగా ఈరోజు ఈ ప్రాంత రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, రైతుల పొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీళ్లు తగ్గడంతో కొత్తగా రైతులు బోరు బావులను తవ్వుకున్న నీళ్లు రాక పోగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు జరిగిన ఈ నష్టానికి కారణం అధికార పార్టీ ప్రభుత్వమని, ఇక్కడి ప్రాంత అధికార ప్రజా ప్రతినిధు లే అని ఇందుకు పూర్తి బాధ్యత వహించి ఎండిపోయిన రైతుల పంట పొలాలను సంబంధిత అధికారులతో పరిశీలించి ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో చేర్యాల ప్రాంతంలో పశువులకు నీళ్లు తాగేందుకు కూడా కరువు వచ్చే పరిస్థితులు ఉన్నాయని, ఈ పరిస్థితుల దృష్ట్యా వెంటనే రిజర్వాయర్ ను దేవాదుల నీళ్లతో నింపి ఈ ప్రాంత చెరువులను, కుంటలను నింపాలని లేని పక్షంలో చేర్యాల ప్రాంత రైతాంగం పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తున్న తీరుపై అధికార కాంగ్రెస్ ప్రభుత్వ తీరును మార్చేందుకు రైతాంగంపై కనికరం లేని ఈ ప్రభుత్వంపై తిరుగుబాటు పోరాటాలు నిర్వహించాలని, రైతులంతా ఏకమ సీపీఐ(ఎం) నిర్వహించే పోరాటాలకు మద్దతునిస్తూ పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, బద్దిపడగ కృష్ణారెడ్డి, అలేటి యాదగిరి,చేర్యాల,కొమురవెల్లి మండలాల కార్యదర్శులు బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, మద్దూరు మండల కార్యదర్శి ఎం డి షఫీ, మండల పట్టణ ,కమిటీ సభ్యులు ఆముదాల నర్సిరెడ్డి, పోలోజు శ్రీహరి, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం,రాళ్లబండి భాస్కర్, రాళ్లబండి చందు,ఎర్రబోస్ అశోక్, మోకు దేవేందర్ రెడ్డి, గొర్రె శ్రీనివాస్, గందాల బాలు,నాగపురి కనకయ్య, బుట్టి చందు,మోకు ఇంద్రం, స్వర్గం శ్రీకాంత్, తేలు ఇస్తారి,చక్రపాణి, బాలస్వామి, గుండ్ర రవీందర్, దండ్ల రమేశ్, నర్సింగ రావ్,గర్నపల్లి చంద్రం, పండుగ యాదగిరి,ఆముదాల రంజిత్ రెడ్డి, తాడూరి భరత్,బొడుగం రాంరెడ్డి, బూరుగు సత్తయ్య, కొంగరి కృష్ణమూర్తి, నూర్ బి, దొనికల కనకవ్వ, ఉల్లంపల్లి సాయిలు,తదితరులు పాల్గొన్నారు.

# కొడుకులు పోషణకు డబ్బులిస్తలేరు




పాలకుర్తి :అమృత్ తెలంగాణ: 'నేను సంపాదించిన భూమిని నా కొడుకులు తలా ఎకరం రిజిస్ట్రేషన్ చేయించుకుని పోషణకు డబ్బులు ఇస్తలేరు. మేము ఇరువురు భార్యాభర్తలం జీవించడం ఇబ్బందిగా ఉంది. నా భూమి నాకు ఇప్పించండి.' అంటూ జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామానికి చెందిన దుంప సొమ్మల్లు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ లో తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం సొమ్మల్లు మాట్లాడుతూ.. తనకు ముగ్గురు కుమారులు ఉన్నారని, తనకున్న మూడెకరాల భూమిని తనకు విషయం చెప్పకుండానే తెల్ల కాగితాలపై సంతకాలు చేయించుకుని ముగ్గురూ ఎకరం చొప్పున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. తాము భార్యాభర్తల పోషణ నిమిత్తం ఒక్కొక్కరు రూ. 3లక్షల చొప్పున రూ. 9 లక్షలు ఇవ్వాలని అంగీకారం జరిగిందని అన్నారు. భూమి రిజిస్ట్రేషన్ చేయించుకొని ఏడాది గడుస్తున్నప్పటికీ ముగ్గురు కుమారుల్లో ఏ ఒక్కరూ ఒక్క పైసా ఇవ్వలేదని బోరున విలపించారు. పోషణకు డబ్బులు ఇవ్వకుండానే తన కుమారుల్లో ఒకరు వేరొకరికి భూమిని అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అమ్ముకున్న భూమిని వేరొకరి పేరున రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపాలని వేడుకున్నాడు. పోషణకు డబ్బులు ఇవ్వడం లేదని, వారి పేరున ఉన్న రిజిస్ట్రేషన్ రద్దుచేసి తన భూమి తనకు ఇప్పించాలని వేడుకున్నారు. స్పందించిన తహసీల్దార్ చర్యలు చేపడతామని తెలిపారు.

# 25 వేల మొక్కల్ని పెంచడమే లక్ష్యం..




దుబ్బాక :అమృత్ తెలంగాణ: స్వయం సహాక మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం కోసమే మహిళా సంఘాలచే నర్సరీల నిర్వహణ చేపట్టడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.అందులో భాగంగానే నర్సరీద్వారా పెంచే మొక్కలను రూ.పది కి ఒకటి చొప్పున తామే కొనుగోలు చేసి మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డుకు 5 వేల చొప్పున అన్నివార్డుల్లో కలిపి 25 వేల మొక్కల్ని నాటేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. సోమవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ 2,3 వార్డుల్లో మహిళా సంఘాలచే పెంచుతున్న నర్సరీలను కమిషనర్ పరిశీలించి పలు సూచనలు చేశారు.ఆయన వెంట మెప్మా సీఓ రేణుక,ఆర్పీ లు, వర్క్ ఇన్ స్పెక్టర్ బుస్స ప్రవీణ్, పలువురున్నారు.

# గ్యాంగ్ లీడర్ బ్యూటీ అందాల డోస్ పెంచుతోంది




నాని గ్యాంగ్ లీడర్ సినిమా తో పాటు శర్వానంద్ తో శ్రీకారం సినిమాలో నటించిన ముద్దుగుమ్మ ప్రియాంక అరుల్ మోహన్. రెండు సినిమాల్లో కూడా చాలా పద్దతైన పక్కింటి అమ్మాయి పాత్రలో కనిపించి మెప్పించిన ఈ అమ్మడు తమిళంలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుంది. శివ కార్తికేయన్ తో డాక్టర్ మరియు డాన్ సినిమాల్లో నటించి సక్సెస్ లు దక్కించుకుంది. సినిమాల ఎంపిక విషయంలో ఈ అమ్మడు ఆచితూచి వ్యవహరిస్తుంది. హీరోయిన్ గా ఈ అమ్మడు చేస్తున్న సినిమాలు తక్కువే అయినా కూడా వచ్చిన గుర్తింపు మాత్రం ఎక్కువే. ఈమె స్కిన్ షో విషయంలో కూడా పెద్దగా ఆసక్తి చూపించిన దాఖలాలు ఇప్పటి వరకు లేదు. కాని తాజా పరిణామాలు చూస్తుంటే ఈ గ్యాంగ్ లీడర్ బ్యూటీ అందాల డోస్ పెంచుతున్నట్లు గా అనిపిస్తుంది. ఆమద్య నడుము అందాన్ని ఎక్స్ పోజ్ చేస్తూ షేర్ చేసిన ఫోటోలు వైరల్ అయ్యాయి. హీరోయిన్ గా ఈ అమ్మడు గ్లామర్ పాత్రలు చేసేందుకు సిద్ధం అన్నట్టుగా ఆ ఫోటోలతో చెప్పకనే చెప్పింది. హీరోయిన్ గా ఇక ముందు చేయబోతున్న సినిమాల్లో ఒక మోస్తరు వరుకు అందాల ఆరబోత కు ఎలాంటి ఇబ్బంది లేదు అన్నట్లుగా మరోసారి ఈ అమ్మడు తాజా ఫోటో షూట్ తో తేల్చి చెప్పింది. ప్రియాంక తాజాగా షేర్ చేసిన ఫోటోల్లో షర్ట్ బటన్స్ పూర్తిగా తీసేసి నడుము అందాన్ని చూపిస్తూ మతులు పోగొడుతోంది. సాదారణంగా ముద్దుగుమ్మలు స్కిన్ షో చేయకుండా అప్పుడప్పుడు ఇలా నడుము కనిపించి కనిపించకుండా ఎక్స్ పోజ్ చేసినా కూడా హాట్ టాపిక్ అవుతుంది. ఇప్పుడ ప్రియాంక మోహన్ విషయంలో అదే జరుగుతుంది. ఈమె చిన్న ఎక్స్ పోజింగ్ కే అందాల డోస్ పెంచుతున్న ప్రియాంక అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. కొందరు మాత్రం ప్రియాంక హాట్ గా కంటే కూడా క్యూట్ గానే ఎక్కువ అందంగా ఉంటుంది. అందుకే ముందు ముందు ఈ అమ్మడు హాట్ అందాలను షేర్ చేయవద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. మరి ఈ అమ్మడి ముందు ముందు అడుగులు ఎలా ఉంటాయో చూడాలి.

# కృతికి ఆరంభమే పాన్ ఇండియా ఆఫర్



కెరీర్ ప్రారంభించిన తక్కువ సమయంలోనే అసాధారణ స్టార్ డమ్ ని అందుకున్న తారలు కొందరున్నారు. ఇటీవలి కాలంలో కన్నడ బ్యూటీ రష్మిక మందన ఈ కేటగిరీకి చెందుతుంది. ఆ తర్వాత మరో పేరు తెలుగు సినీసర్కిల్స్ లో ప్రముఖంగా వినిపిస్తోంది. ఉప్పెన బ్యూటీ కృతి శెట్టి మోస్ట్ లక్కీయెస్ట్ గాళ్! అంటూ ప్రశంసలు అందుకుంటోంది. ఈ బ్యూటీ ఉప్పెన తర్వాత వరుసగా పలు క్రేజీ చిత్రాలకు సంతకాలు చేసింది. ఇందులో వారియర్ లాంటి పాన్ ఇండియా సినిమా తనకే దక్కడం లక్కీ అని చెప్పాలి. ఇటీవల విడుదలైన ట్రైలర్ లో కృతి లుక్ ఎంతో క్యూట్ గా ఆకట్టుకుంది. నిజానికి కొందరికి టైమ్ అలా కలిసొచ్చేస్తుంది. కెరీర్ ఆరంభమే లింగుస్వామి లాంటి ప్రతిభావంతుడి నిర్దేశనంలో కృతి పాన్ ఇండియా నాయికగా పరిచయమైపోతోంది. ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని సరసన కృతి శెట్టి కనిపించనుంది. లింగుసామి దర్శకత్వం వహించిన ఈ చిత్రం గురువారం విడుదల కానుంది. సెన్సార్ సహా అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. యుఏ సర్టిఫికేట్ ను పొందినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమా 155 నిమిషాల నిడివితో ఉంటుందని.. ఇది మంచి రన్ టైమ్ అని కూడా చిత్రబృందం ధృవీకరించారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ నిర్మించిన ఈ ద్విభాషా చిత్రంలో ఆది పినిశెట్టి- అక్షర గౌడ- నదియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సౌండ్ ట్రాక్ లు అందించారు.

# ఆ మూడు రోజులు మధురమైనవి అంటున్న మిల్కీ బ్యూటీ!



పాల నురగ చాయతో మెరిసిపోయే మిల్కీ బ్యూటీ తమన్నా సినిమా రంగంలోకి ప్రవేశించి దాదాపు 15 ఏళ్లు దాటిపోయింది. మంచు మోహన్ బాబు కుమారుడు మంచు మనోజ్ హీరోగా శ్రీ చిత్రంలో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన ఈ అందాల భామ ఆ తర్వాత టాలీవుడ్ లో స్టార్ హీరోలందరితో నటించింది. ఇక మెగా హీరోలందరితో నటించిన రికార్డు తమన్నా పేరు మీదే ఉంది. మెగాస్టార్ చిరంజీవి (సైరా) పవన్ కల్యాణ్ (కెమెరామెన్ గంగతో రాంబాబు) వరుణ్ తేజ్ (ఎఫ్ 3) రామ్ చరణ్ (రచ్చ) అల్లు అర్జున్ (బద్రీనాథ్) ఇలా మెగా హీరోలతో ఆడిపాడింది.. ఈ భామ. వీరు మాత్రమే కాకుండా టాలీవుడ్ స్టార్ హీరోలందరితోనూ తమన్నా నటించింది. కాగా తమన్నా ఓవైపు సినిమాలు వెబ్ సిరీసుల్లో మరోవైపు ఐటెమ్ సాంగులకు కూడా ఓకే అంటోంది. దాదాపు ఆమె కెరీర్ ఎండింగ్ కు చేరుకుంది. ఈ నేపథ్యంలో దీపముండగానే ఇళ్లు చక్కబెట్టుకోవాలనే రీతిలో వచ్చిన ప్రతి ఆఫర్ కు సై అంటోంది. అలాగే మరోవైపు ఈ భామకు ఆధ్యాత్మిక చింతన కూడా ఎక్కువే. ఇటీవల కాలంలో గుళ్లూ గోపురాలు శక్తి పీఠాలు అంటూ సందర్శనలు చేస్తోంది. తన తోటి హీరోయిన్లు.. సమంత నయనతారలు ఈ దేవాలయాల సందర్శనలో మిల్కీ బ్యూటీకి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంతవరకు పెళ్లి ఊసెత్తని తమన్నాషూటింగ్ విరామ సమయంలో ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుంటోంది. అంతేకాదు ఇటీవల హిమాలయ ప్రాంతాలను కూడా చుట్టివచ్చింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# సౌందర్యలో ఎన్నటికీ తరగని నిధులు అవే



రాంచీ డైరీస్- రక్తాంచల్ వెబ్ సిరీస్ లతో పాపులరైన బ్యూటీ సౌందర్య శర్మ. దిల్లీ టు గల్లీ ఈ భామకు భారీ ఫాలోయింగ్ పెరిగింది అంటే ఆ రెండు సిరీస్ లు కారణం. నటిగా మరో లెవల్ చూపించిన ఈ బ్యూటీ నిజానికి యాక్టర్ కాబోయి డాక్టర్ అయిన తన మామ్ ఇచ్చిన స్పూర్తితో సినీరంగంలో అడుగుపెట్టింది. ఇక ఇటీవలి కాలంలో బాలీవుడ్ లో బిగ్ రేంజ్ చూపించేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. పంతం పట్టుదలతో ఎంత దూరం అయినా వెళ్లేందుకు సౌందర్య శర్మ వెనకాడదు. పోటీ ప్రపంచంలో తనని తాను ఆవిష్కరించుకునేందుకు వైవిధ్యమైన ప్లాన్ తో దూసుకెళుతోంది. అనుపమ్ ఖేర్ నిర్మించిన రాంచీ డైరీస్ తో తెరకు పరిచయమైన సౌందర్య శర్మ నటిగా తన పాత్రను పోషించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. ఆ తర్వాత రక్తాంచల్ రెండు భాగాల్లో నటించింది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com